క్లుప్తంగా

ఎల్.కోటలో ఉచిత వైద్య శిబిరం



శిబిరంలో వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది

లక్కవరపుకోట: మండల కేంద్రంలోని సంఘం వీధిలో బంగారు బుల్లోడు సేవా సమితి, విశ్వ బ్రాహ్మణ సేవా సంఘాలు సంయుక్తంగా విశాఖ ఓమ్ని ఆర్.కె.ఆస్పత్రి సౌజన్యంతో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో సుమారు 200 మంది ప్రజలకు వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, వైఎస్సార్సీపీ నాయకులు కె.సూర్యారావు, విశ్వబ్రాహ్మణ సంఘ ఉపాధ్యక్షుడు బంగారు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

జామి: మండలంలోని రామయ్యపాలెం గ్రామంలో గురువారం తెల్లవారు జామున సంభవించిన అగ్నిప్రమాదంలో ముంతా రాముకి చెందిన పూరిల్లు దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాలు... రాము ఇంటిలో రాత్రి కట్టెల పొయ్యిపై వంట చేసిన తర్వాత నిప్పులు పూర్తిగా ఆపకపోవడంతో నిప్పు వ్వలు రాజుకుని ఇంటికి నిప్పు అంటుకోవడంతో పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదంలో రూ.18 వేలు నగదు, దుస్తులు,వంట సామాగ్రి తదితర సామాగ్రి కాలిపోవడంతో బాధిత కుటుంబం కట్టుబట్టలతో మిగిలారు. ప్రమాదంలో సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం సంభవించిందని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో మేలుకొలుపు



హరినామ సంకీర్తనలతో మేలుకొలుపు నిర్వహిస్తున్న చిన్నారులు

లక్కవరపుకోట: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మండలంలోని రెల్లిగౌరమ్మపేట గ్రామంలో గురువారం వేకువ జామున చిన్నారులు మేలుకొలుపు కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు మేళతాళాలతో హరినామ సంకీర్తన చేస్తూ గ్రామం అంతటా తిరిగారు. చిన్నారులు గత నెల 16వ తేదీ నుంచి ఈ మేలుకొలుపులు నిర్వహిస్తున్నారు.

ఆధార్ అనుసంధానం తప్పనిసరి

బొండపల్లి: ఉపాధి హామీ వేతనదారులు తమ జాబ్ కార్డులకు తప్పనిసరిగా ఆధార్‌తో అనుసంధా నం చేయించుకోవాలని ఏపీఓ బి.కృష్ణవేణి గురువారం ఓ ప్రకటనలో సూచించారు. వేతనదారులు గ్రామాల్లోనే వలంటీర్ల ద్వారా ఆధార్ అనుసంధానం చేయించుకోవచ్చని తెలిపారు. ఆధార్ అనుసంధానం చేసుకోవడం వల్ల వచ్చే ఏడాది నుంచి పనుల కేటాయింపుతో పాటు వేతనాల చెల్లింపుల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకావని పేర్కొన్నారు.

తాగునీటి బోరు ప్రారంభం



చేతి బోరును ప్రారంభిస్తున్న నాయకులు

గుర్ల: మండలంలోని కోటగండ్రేడులో సర్పంచ్ ముద్దాడ ప్రసన్న కుమారి తన సొంత నిధులతో గ్రామంలోని కొత్తమ్మతల్లి గుడి వద్ద తాగునీటి బోరును ఏర్పాటు చేయించారు. ఈ బోరును జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్సీపీ జిల్లా ప్రధాన కార్యద ర్శి కె.వి.సూర్య నారాయణ రాజు, వైఎస్సార్సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు గురువారం ప్రారంభించారు. బోరు ఏర్పాటు చేసినందుకు సర్పంచ్ ప్రసన్న కుమారి,ముద్దాడ శ్రీనివాసరావుకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు, నాయకులు కెంగువ మధుసూదనరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీ పరిశీలన



ఎస్‌డబ్ల్యూపీసీలో వర్మీకంపోస్టును పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం

దత్తిరాజేరు: మండలంలోని దత్తి గ్రామంలో ఎస్‌డబ్ల్యూపీసీ (చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం)ని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పంచాయతీ కార్యదర్శి ప్రతిమాదేవికి ఆయన పలుసూచనలు చేశారు. గ్రీన్ అంబాసిడర్లు రోజూ గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి ఎస్‌డబ్ల్యూపీసీకి తీసుకువచ్చేలా చూడాలని అన్నారు. కేంద్రంలో వర్మీకంపోస్టు తయారు చేయించి రైతులకు నామమాత్రపు ధరకు అందజేయాలని ఆదేశించారు.

యువతకు ఆదర్శం స్వామి వివేకానంద

● ఘనంగా వివేకానంద జయంతి ఉత్సవాలు



గజపతినగరం: వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న న్యాయవాదులు



కొత్తవలస: తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేస్తున్న తహసీల్దార్ ప్రసాదరావు

కొత్తవలస: స్వామి వివేకానంద నేటి యువతరానికి ఆదర్శప్రాయుడని తహసీల్దార్ డి.ప్రసాదరావు అన్నారు. వివేకానంద జయంతి సందర్భంగా తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని వివేకానంద విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అలాగే మూడురోడ్ల జంక్షన్‌లోని వివేకానందుడి విగ్రహానికి వివేకానంద యువజన సేవా సంఘం సభ్యులు ఆ సంఘం అధ్యక్షుడు కొరుపోలు అప్పారావు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. 70 మంది పేద వృద్ధులకు చీరలు, దుప్పట్ల పంపిణీతో పాటు భోజన ఏర్పాట్లు చేశారు. అలాగే మండల కేంద్రంలోని యువత వివేకానంద ఆశయాలను కొనసాగిద్దామనే నినాదంతో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్‌లు ఎం.హర్షవర్ధిణి, కోట అప్పారావు, సీఎస్‌డీటీ రమేష్, వివేకానంద యువజన సేవాసంఘం గౌరవ అధ్యక్షుడు మాన్యం దేముడు, సభ్యులు కనకాల శివ, బంగారు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత వివేకానంద

గజపతినగరం: భారతదేశ సంస్కృతి సంప్రదాయాలను, విశిష్టతను ప్రపంచ దేశాలకు చాటిచెప్పి, దేశ భవిష్యత్ తీర్చిదిద్దే శక్తి యువతరం చేతుల్లోనే ఉందని చెప్పిన వివేకానందను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని గజపతినగరం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయవాదులు అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో వివేకానంద జయంతిని న్యాయవాదుల సంఘం సెక్రటరి పొట్నూరు శ్రీను ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. వివేకానంద చిత్రపటానికి న్యాయవాదులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పలువురు వక్తలు స్వామి వివేకానంద గొప్పతనాన్ని కొనియాడారు. కార్యక్రమంలో న్యాయవాదులు రమేష్ రాజు, విద్యాసాగర్, కొల్లూరి సాయిశేఖర్, దేవుడు, తిరుపతి, రామునాయుడు, శీర వాసు, జె.జగదీష్, సన్యాసిరావు పాల్గొన్నారు.

వివేకానందుని ఆశయాలకు జీవం పోద్దాం

గజపతినగరం రూరల్: స్వామి వివేకానంద ఆశయాలకు నేటి యువత జీవం పోయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. వివేకానంద జయంతిని పురస్కరించుకుని మరుపల్లి గ్రామంలో యువత గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వివేకానందుని బోధనలు, సూక్తులు కేవలం భారత యువతరానికి మాత్రమే పరిమితం కాలేదని, ప్రపంచ దేశాల యువత ఆయన్ని ఆదర్శంగా తీసుకుంటున్నారని చెప్పారు.



కొత్తవలస: వివేకానంద విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పిస్తున్న వివేకానంద సంఘం సభ్యులు



గజపతినగరం రూరల్: మరుపల్లిలో ర్యాలీ చేస్తున్న యువత



కొత్తవలస: కొత్తవలసలో యువత ర్యాలీ

సచివాలయాల ద్వారా సమస్యల పరిష్కారం



సచివాలయం వద్ద స్థానికులతో మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన

● ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లిరూరల్: గ్రామాల్లో ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ సేవలన్నీ గ్రామాల్లోనే అందించేందుకు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను నెలకొల్పారని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని కరకాం గ్రామసచివాలయంలో గురువారం ఆయన తనిఖీలు నిర్వహించారు. సచివాలయం పరిధిలో పథకాల లబ్ధిదారుల వివరాలు, స్పంద నలో అందిన అర్జీల్లో ఎన్నింటిని పరిష్కరించారో సిబ్బందిని ఆరా తీశారు. స్థానిక నాయకులు, గ్రామస్తులతో మాట్లాడుతూ గ్రామంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా, అర్హత ఉన్నా పింఛన్, పథకాలు అందని వారు ఎవరైనా ఉన్నారా అని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో అర్హులందరికీ పథకాలు అందుతున్నాయని స్థానికులు తెలిపారు. గ్రామంలో నివాసాల మీదుగా విద్యుత్ తీగలు ఉన్నాయని, వాటిని పక్కకు మార్పించాలని, అలాగే శిథిలావస్థకు చెందిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవాటిని వేయించాలని గ్రామస్తులు ఎంపీని కోరారు. ఆర్ఈసీఎస్ ఏడీకు ఎంపీ ఫోన్‌లో మాట్లాడి సమస్యను తక్షణమే పరిష్క రించాలని సూచించగా... ఏడీ స్పందిస్తూ ఎస్టిమేషన్ వేసి పనులు చేపడతామని బదులిచ్చారు. రాష్ట్రంలో అవినీతి రహిత సంక్షేమ, అభివృద్ధి పాలన సాగుతోందని అన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించేందుకు సచివాలయ వ్యవస్థను, రైతుల కోసం రైతుభరోసా కేంద్రాలను గ్రామాల్లో ఏర్పాటు చేశామని, ప్రజారోగ్యం కోసం వెల్‌నెస్ సెంటర్‌లను నిర్మిస్తున్నామని చెప్పారు. స్థానిక ప్రజాప్రతినిధులు సమష్టిగా పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఎంపీ వెంట రామలింగాపురం పీఏసీఎస్ అధ్యక్షుడు పనస అప్పారావు, స్థానిక వైఎస్సార్సీపీ నాయకులు జమ్ము సునీల్, గంగుపల్లి తాడు, మీసాల చంద్రరావు, వై.అప్పలనాయుడు, ఏ.అప్పారావు పాల్గొన్నారు.

సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

గుర్ల: సాగులో ఆధునిక పద్ధతులు పాటించడం వల్ల పెట్టుబడి ఆదా అవుతుందని, అధికదిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ జేడీ త్రినాథ స్వామి అన్నారు. మండలంలోని కోటగండ్రేడులో రైతులకు సీడ్ డ్రిల్ ద్వారా మొక్కజొన్న విత్తనాలు విత్తడంపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుక్కు దున్నకుండా మొక్కజొన్న విత్తనాలను డబుల్ వీల్ మార్కర్‌తో పాటు, సీడ్ డ్రిల్ యంత్రంతో విత్తవచ్చని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు, వైఎస్సార్ సీపీ మండల నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, అగ్రికల్చరల్ అడ్వయిజరీ బోర్డు మండల అధ్యక్షుడు ముద్దాడ కేశవరావు, కెంగువ మధుసూదనరావు, మంత్రి వెంకటరమణ, ముద్దాడ శ్రీనివాసరావు, ఏఓ తిరుపతిరావు, రెడ్డీస్ సంస్థ మేనేజర్ హరిబాబు, చనమల్లు రవి , రమేష్ దేవుడుబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గృహనిర్మాణాలను వేగవంతం చేయండి



గృహనిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ పట్నాయక్

వేపాడ: సొంత స్థలాలతో పాటు జగనన్న లేఅవుట్లలో గృహనిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతం చేయా లని ఎంపీడీఓ పట్నాయక్ అన్నారు. మండలంలోని వావిలపాడు గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు. తొలుత గ్రామంలో గృహ నిర్మాణలను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి ఫిబ్రవరిలో సామూహిక గృహప్రవేశాలకు సిద్ధం కావాలని సూచించారు. అలాగే స్థానిక రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. ధాన్యం కొనుగోలు, రబీ సీజన్‌కు సంబంధించి విత్తనాల పంపిణీ తదితర అంశాలపై వీఏఏను ఆరా తీశారు. గ్రామంలో దుస్తుల దుకాణం నిర్వాహకులతో మాట్లాడి, జగనన్న తోడు పథకం సొమ్ము అందిందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి కన్నంనాయుడు, గ్రామపెద్ద సతీష్ ఉన్నారు.

108లో ప్రసవం



108 వాహనంలో ప్రసవించిన మహిళకు సపర్యలు చేస్తున్న సిబ్బంది

బొండపల్లి: మండలంలోని కొత్త పాలెం గ్రామానికి చెందిన గర్భిణికి పురిటినొప్పులు రావడంతో 108 వాహనంలో విజయనగరంలోని ఘోషా ఆస్పత్రికి తరలిస్తుండగా వాహనంలోనే ప్రసవించింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పి.పావని రెండవ కాన్పు కావడంతో 108 వాహనంలో విజయనగరం ఆస్పత్రికి వెళ్తుండగా మార్గమధ్యంలో అయ్యన్నపేట సమీపంలో వాహనంలోనే ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ప్రసవానంతరం తల్లీబిడ్డలు క్షేమంగా ఉండడంతో ఘోషా ఆస్పత్రికి చికిత్స కోసం ఈఎంటీ ఎ.రాంబాబు, పైలెట్ పి.వాసు తరలించారు.

రోడ్డు పనులకు భూమిపూజ



భూమిపూజ కార్యక్రమంలో ఎంపీపీ సత్యవంతుడు

వేపాడ: మండలంలోని కృష్ణరాయుడుపేటలో గ్రావెల్ రోడ్డు పనులకు ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు గురువారం భూమి పూజ చేశారు. మండల పరిషత్, పంచాయతీ నిధులతో కొత్తవలస-దేవరాపల్లి బీటీరోడ్డు నుంచి కృష్ణరాయుడుపేటలోని గుడి వరకు రోడ్డు నిర్మించనున్నామని చెప్పారు. వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు,మాజీ సర్పంచ్ పైడిబాబు పాల్గొన్నారు.

తప్పులు లేని జాబితా సిద్ధం చేయండి

దత్తిరాజేరు: మండలంలోని అన్ని గ్రామాల నూతన ఓటర్ల జాబితాను త ప్పులు లేకుండా సిద్ధం చేయాలని బీఎల్‌ఓల ను ఆదేశించామని తహసీల్దార్ రమేష్ చెప్పా రు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఎన్నికల డీటీ సతీష్‌తో కలిసి గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడు తూ మృతి చెందిన వారిని ఓటర్ల జాబితా నుంచి తొలిగిస్తున్నామని, అలాగే జాబితాలో ఫొ టోలు సరిగా లేని వారిని గుర్తించి, మళ్లీ వారి ఫొటోలు సేకరించి జతచేస్తున్నామని చెప్పారు.

రీసర్వే పనుల పరిశీలన



రీసర్వే పనులు పరిశీలిస్తున్న జేసీ మయూర్ అశోక్

కొత్తవలస రూరల్: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా మండలంలోని ఉత్తరాపల్లి గ్రామంలో చేపడుతున్న రీసర్వే పనులను జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ గురువారం పరిశీలించారు. ఎటువంటి తప్పులూ దొర్లకుండా సర్వే సకాలంలో పూర్తి చేసేందుకు సర్వే సిబ్బందికి సహకరించాలని రైతులను ఆయన కోరారు. హద్దులు, కొలతల విషయంలో ఎలాంటి తేడాలు రాకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. జేసీ వెంట తహసీల్దార్ దేవుపల్లి ప్రసాదరావు, తదితరులు ఉన్నారు.

దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త, నాయకులు

గజపతినగరం రూరల్: సంక్రాంతి పండగను పురస్కరించుకుని మండలంలోని మల్లునాయుడుపేట గ్రామంలోని డప్పు కళాకారులు, పారిశుద్ధ్య కార్మికులకు ఆగ్రామ అంగన్‌వాడీ కార్యకర్త బానాల నరసమ్మ దుస్తులు సమకూర్చారు, వీటిని స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ, వైస్ సర్పంచ్, వైఎస్సార్సీపీ నాయకులు గురువారం పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తను ప్రజాప్రతినిధులు అభినందించారు.

సేవా దృక్పథం అలవర్చుకోవాలి



సర్టిఫికెట్‌లు అందుకున్న ఎన్‌సీసీ క్యాడెట్‌లు

కొత్తవలస రూరల్: విద్యార్థులు, యువత సేవాదృక్పథాన్ని అలవర్చుకోవాలని, ప్రత్యేకంగా ఎన్‌సీసీ క్యాడెట్లు సేవాకార్యక్రమాల్లో ముందుండాలని వాగ్దేవి విద్యాసంస్థల అధినేత మహేశ్వరరావు అన్నారు. మండలంలోని తుమ్మికాపల్లి వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ శిక్షణ పూర్తి చేసుకున్న క్యాడెట్లకు 'బి' సర్టిఫికెట్‌లను ఎన్‌సీసీ అధికారులతో కలిసి గురువారం అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కుమార్‌బాబు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

త్వరితగతిన దేవాలయాల నిర్మాణం



గరివిడి మండలం శివరాం గ్రామంలో మాట్లాడుతున్న ఇండోమెంట్ ఈఈ, మండల నాయకులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని 16 పంచాయతీల్లో దేవాలయాల నిర్మాణాలను త్వరితగతిన చేపట్టాలని దేవదాయశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీహెచ్‌వీ.రమణ అన్నారు. గరివిడి మండలంలో 16 దేవాలయాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం దేవదాయశాఖ నుంచి రూ.1.60 కోట్లు విడుదల చేసింది. 16 పంచాయతీల్లో ఆలయ నిర్మాణ స్థలాలను వైఎస్సార్సీపీ మండల నాయకుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, మాజీ ఎంపీపీ కొణిశ కృష్ణంనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎలకల అప్పలనాయుడుతో కలిసి గురువారం పరిశీలించారు. మండలంలోని శివరాం , వెదుళ్లవలస, గరివిడి, రేగటి పంచాయతీల్లో కొంత మేర దేవాలయ నిర్మాణ పనులు జరిగాయని, ఈ ఆలయాలకు సంబంధించి కమిషనర్ నుంచి అనుమతి తీసుకుని పేమెంట్ చేస్తామన్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ లక్ష్మి, గవిడి దాలినాయుడు పాల్గొన్నారు.

నాణ్యమైన కందిపప్పు అందిస్తున్నాం



ఎస్.కోట కార్యాలయంలో కందిపప్పును పరీక్షిస్తున్న రెవెన్యూ అధికారులు



చీపురుపల్లిలో లబ్ధిదారుల సమక్షంలో కందిపప్పు నాణ్యతను పరిశీలిస్తున్న సీఎస్‌డీటీ రామారావు

శృంగవరపుకోట: ప్రభుత్వం పౌరసరఫరాలశాఖ ద్వారా రేషన్ లబ్ధిదారులకు నాణ్యమైన కందిపప్పు పంపిణీ చేస్తోందని ఆ శాఖ అధికారులు అన్నారు. పౌరసరఫరాల శాఖ ద్వారా పంపిణీ చేస్తున్న కంది పప్పు నాణ్యత లేదని, పుచ్చిన పప్పు ఇస్తున్నారని, సరిగ్గా ఉడకడం లేదని చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని పౌరసరఫరాల శాఖ అధికారులు తేల్చారు. పట్టణంలోని ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి తెచ్చిన కందిపప్పు నాణ్యతను స్థానిక తహసీల్దార్ శ్రీనివాసరావు, సీఎస్‌డీటీ ఎస్.వి.వి.ఎస్. మూర్తి తదితరుల సమక్షంలో తహసీల్దార్ కార్యాలయంలో గురువారం పరిశీలించారు. కందిపప్పును ఉడికించి పరిశీలించ గా.. దుకాణాల్లో కొనుగోలు చేసుకునే పప్పు మాదిరిగానే ఉడుకుతోందని, ఎటువంటి పురుగులు లేవని నిర్ధారించారు. అలాగే కొత్తవలస ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి సేకరించిన కందిపప్పును ఆ మండల తహసీల్దార్ డి.ప్రసాదరావు, సీఎస్‌డీటీ ఏ.రామారావుల సమక్షంలో ఉడికించి పరిశీలించారు. కందిపప్పు నాణ్యతలో ఎటువంటి సందేహాలు లేవని తేల్చి చెప్పారు.

రూ.67 కే కిలో కందిపప్పు

చీపురుపల్లి: ప్రభుత్వం రేషన్‌డిపోల ద్వారా నాణ్యమైన కందిపప్పును లబ్ధిదారులకు కిలో రూ. 67కే పంపిణీ చేస్తుందని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సీఎస్‌డీటీ పి.రామారావు సూచించారు. పౌరసరఫరాల శాఖ ద్వారా పంపిణీ చేస్తున్న కంది పప్పును పట్టణంలో రేషన్ లబ్ధిదారుల సమక్షంలో ఉడికించి నాణ్యతను గురువారం పరిశీలించారు. రేషన్‌లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న కందిపప్పు నాణ్యతపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో లబ్ధిదారుల్లో అపోహలు తొలగించాలనే ఉద్దేశంతో వారి సమక్షంలో నాణ్యత పరిశీస్తున్నామని సీఎస్‌డీటీ చెప్పారు.

ఉపకరణాల పంపిణీ



ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

జామి: సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో స్థానిక అల్లువీధి పాఠశాలలోని భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు ఎంపీపీ సబ్బవరపు అరుణ, వైస్ ఎంపీపీ ఎన్నింటి విజయలక్ష్మి గురువారం ఉపకరణాలు పంపిణీ చేశారు. నలుగురికి వీల్ చైర్లు, నలుగురికి సీపీ చైర్స్, ఒకరికి ట్రై సైకిల్, ఇద్దరికి రోలేటర్స్ అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ జయశ్రీ, ఎంపీటీసీ సూరిదేముడు, ఐఈఆర్టీలు నారాయణరావు, ఎస్.దేవి, ఐఈ డీఎస్ఎస్ టీచర్ బుచ్చిరాజు, వార్డు మెంబర్లు అల్లు అవినాష్ పాల్గొన్నారు.

రూ. 4.80 కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణం

● మంత్రి బొత్స, జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసరావు కృషితో నిధులు మంజూరు



గర్భాం- గరివిడి ప్రధాన రహదారి నుంచి చెల్లాపురం గ్రామానికి నిర్మించిన బీటీ రోడ్డు



ఊటపల్లి నుంచి కొమ్మానివలసకు చేపడుతున్న రోడ్డు పనులు

మెరకముడిదాం: గ్రామీణ ప్రాంతాల రోడ్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. మండలంలో ఏడు గ్రామాలకు సంబంధించిన మట్టి రోడ్లను తారురోడ్లుగా అభివృద్ధి చేసేందుకు మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చొరవతో ప్రభుత్వం రూ.4.80 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో ఆయా గ్రామాలకు రోడ్ల నిర్మాణ పనులు ఇటీవలే పూర్తయ్యాయి. గర్భాం-గరివిడి ప్రధాన రహదారి నుంచి బొడందొరవలస, చినమంత్రిపేట మీదుగా చెల్లాపురం వరకు రూ.2.25 కోట్లుతో 2.85 కిలోమీటర్లు, చినరవ్వాం నుంచి పెదరవ్వాం వరకు రూ.85 లక్షలతో 1.50 కిలోమీటర్లు మేర తారు రోడ్డు నిర్మించారు. అలాగే గర్భాం-గరివిడి ప్రధాన రహదారి నుంచి లెంకపేట వరకు రూ.35 లక్షలతో అర కిలోమీటరు, ఊటపల్లి నుంచి కొమ్మానివలస వరకు రూ.1.35 కోట్లతో రోడ్లు వేశారు. అధ్వాన మట్టిరోడ్లపై రాకపోకలు సాగించేందుకు ఎన్నో ఏళ్లుగా తాము పడిన ఇబ్బందులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తొలగిపోయాయి ని ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రోడ్ల నిర్మాణానికి కృషి చేసిన మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు వారు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.